# మనసును మరిస్తే ఉన్నది ఆత్మయే!

**భవ్యభావాలతో కూడిన భారతంబు**
**దివ్యసంస్కృతి తత్త్వంబు తెలుసుకొనగ**
**భారతీయులు యత్నింపనేరరైరి**
**ఇంతకంటెను దౌర్భాగ్యమేమికలదు?**

దివ్యాత్మస్వరూపులారా!

భారతీయులు స్వాతంత్ర్యమును పొందగల్గిరిగాని ఐకమత్యమును సాధించలేకపోతున్నారు. ఐక్యతలేని స్వాతంత్ర్యము కరెంటులేని వైరువంటిది. భారతీయులది పవిత్రమైన సనాతన ధర్మము. ఇది ఉత్కృష్టమైనది, సౌశీల్యముతోకూడినది. అవతారములకు యిది ఆటపట్టు. ఋషులు, మునులు, యోగులు, వీరులు, ధీరులు, శూరులు పతివ్రతామతల్లులకు యిది పుట్టినిల్లు. మబ్బులు కప్పిన సూర్యుడు కొంతకాలము కన్పించకపోవచ్చును. కానీ, సూర్యుడు లేడనుటకు వీలులేదు. అదేవిధముగనే కొన్ని సాంప్రదాయములు, కొన్ని ఆధునిక పద్ధతులనే మేఘములు అడ్డగించటంచేత భారతీయ సంస్కృతి కొంత కను మరుగైనది కాని, దీనికి యేనాటికినీ నాశనములేదు. ప్రతీ యుగమునందు మహాపురుషులు అవతరిస్తూనే వున్నారు. ఇట్టి మహాపురుషులు అవతరించని యుగమేలేదు, భారతదేశములో.

**భారతదేశమునందు లేనిది మరి ఏ దేశమునందు కన్పించదు**

విదేశీయులు భారతదేశమును సహస్రనేత్రములతో గమనిస్తున్నారు. కేవలము భారతీయులయొక్క సిద్ధాంతమేకాక ఆధ్యాత్మికతత్త్వముపైనకూడా అనేకవిధములైన ఆశలు కల్పించుకొని విదేశీయులు దీనిని ఆశ్రయిస్తూ వస్తున్నారు. కానీ, భారతీయుల వారసత్వమైన యీ సంస్కృతిని భారతీయులే తొలగించుటకు ప్రయత్నిస్తున్నారు. ఇదే

sri sathyasai vachanamrutam

విచిత్రమైన వైపరీత్యము. నిజముగా భారతీయసంస్కృతిని యిట్టిది, అట్టిది అని వర్ణించుటకు ఎవ్వరి తరముకాదు. యీనాడు భారతీయులు లౌకికమైన భోగభాగ్యముల నాశించి దివ్యమైన, నవ్యమైన, భవ్యమైన మన సంస్కృతిని విస్మరిస్తూ వస్తున్నారు. భౌతిక సంపదలు అవసరమే! కాని, భౌతిక సంపదలతోపాటు ఆధ్యాత్మిక సంపదనుకూడను మనము అభివృద్ధిగావించినప్పుడే తిరిగి మనము యితరదేశీయులకు కొంత ఆదర్శాన్ని అందించినవారమౌతాము. దురదృష్టవశాత్తు యీనాడు భారతీయసంస్కృతిని ప్రభుత్వముకూడను విస్మరించి దానికి విరుద్ధమైన మార్గములను అవలంబిస్తున్నారు. వీరియొక్క భాషణలు, ఆదేశములు గంభీరముగా వుండవచ్చు. కానీ వీరి దృష్టి అంతయు పాశ్చాత్యుల నాగరికతపైనే వున్నది. భారతీయులుకూడను యీయొక్క నాగరికతపై దృష్టిని లగ్నముచేసి దానియందే ఆసక్తిని కనపరుస్తున్నారు. ఇది గొప్ప దురదృష్టము.

**మండెడుకాంతితో మేరుపర్వతముండ**
**వెండిబంగారులకై వెదుకనేల**
**కోరినఫలమిచ్చు కల్పవృక్షంబుండ**
**పెరటిపుష్పములకై ప్రీతియేల**
**అడిగిన పాలిచ్చు కామధేనువుండ**
**ధనమిచ్చి ఆవును కొనగనేల**

భారతదేశమునందులేనిది మరి యేదేశమునందు కన్పించదు. ఇట్టి సర్వకళ్యాణములతో, సర్వగుణములతో, సర్వశక్తులతో యిమిడివున్న యీ భారతదేశాన్ని విమర్శించి తూలనాడటము, భారతదేశాన్ని హాస్యాస్పదముగా చూడటము, భారతీయ సంస్కృతిని విస్మరించి దీనిని విమర్శించటానికి ప్రయత్నించటము, యిది భారతీయులయొక్క దురదృష్టము.

**ఎన్ని బలములుండినను ఆధ్యాత్మికబలము లేనప్పుడు అవి నిరుపయోగమే!**

నిజముగా భారతీయులయొక్క మహాభాగ్యమనేది, యింత అంత అని చెప్పుటకు వీలుకాదు. దానిని అనుభవించటానికి కొంతవరకు యోగ్యతకూడను అత్యవసరము.

sri sathyasai vahini vachanamrutam

పాండిత్యము వుండవచ్చును. విద్యావంతుడు కావచ్చును. శక్తిమంతుడుగా వుండవచ్చును. కానీ, ఎన్ని బలములుండికూడను ఆధ్యాత్మిక బలమేలేనప్పుడు యిది నిరుపయోగమనే తోస్తుంది.

**వేదశాస్త్రములు వివరించి బుధులచే**
**చదివించవచ్చు తాచదువవచ్చు**
**యజ్ఞయాగతపము లధికారజనులచే**
**చేయించవచ్చు తాచేయవచ్చు**
**ఇలలోనగల తీర్థములకేగనన్యుల**
**బోధించవచ్చు తాపోవవచ్చు**
**అష్టాంగయోగ విద్య లార్యులకును బోధ**
**సలుపంగవచ్చు తాసలుపవచ్చు**

కానీ, దేహేంద్రియములనరికట్టి, మనసు నిల్పి ఆత్మతత్త్వము పొందేది యెవ్వరికీ సాధ్యముకాదు. దాని తత్వమును గుర్తించినవారే భారతీయులయొక్క మహాభాగ్యమును గుర్తించటానికి అధికారులౌతారు.

భారతదేశీయులందరుకూడను ఒక తల్లిబిడ్డలే! దేశభాషలు వేరు కావచ్చును. కానీ అందరూ ఒకే కుటుంబానికి చెందినవారే! భారతీయులందరిదికూడ ఒక్క జాతియే. ఈ జాతికి ప్రభువు ఒక్కడే! అతడే భగవంతుడు. అట్టి భగవంతునియొక్క అనుగ్రహానికి పాత్రుడుకావలెనంటె నీ పదవులు, నీ విద్య, నీ ముక్తి, నీ యోగములు యేమాత్రము పనికిరావు. అతడు కేవలము ఒక్క ప్రేమకు మాత్రమే బద్ధుడౌతాడు. కారణమేమనగా భగవంతునికి ప్రేమ స్వభావము. అట్టి ప్రేమద్వారానే మనము భగవంతుని పొందగలముగానీ అన్యమార్గములో అతను లభ్యముకాడు. మానవునియందుకూడను ప్రేమ వున్నది. ఈ ప్రేమచేతనే భగవత్ప్రేమను సంపాదించి ప్రేమతత్వమునందు ప్రేమాత్మను కలిపి ప్రేమమయుడుగా తాను జీవించాలి. మనము ఉద్యోగములచేతను, వాపారములచేతను ధనము సంపాదించుకుంటాము. ఈ ధనమంతాకూడను

sri sathyasai vachanamrutam

అనిత్యమైనది. నిత్యమైన, సత్యమైన ఆధ్యాత్మిక ధనమును కేవలం ప్రేమద్వారానే మనము పరమాత్మను ఆస్వాదించి, అనుగ్రహాన్నిపొంది, యీ ప్రేమధనమును సంపాదించుకోవాలి.

**ఆత్మభావమే ప్రతిమానవునకు అత్యవసరము**

ప్రేమ ఒక దిక్సూచియంత్రము వంటింది. యీ దిక్సూచి యెక్కడ పెట్టినప్పటికిని ఉత్తరదిక్కువైపే తనముల్లు చూపుతుంది. అదేవిధముగనే పరమభక్తుడైన మానవుని దృష్టి యేమిచూచినా, యేమిచెప్పినా, యేమితలచినా అది భగవంతుని గురించే వుంటుంది. అట్టి దివ్యప్రేమను మనము తన, పర, అనే భేదములేకుండా పాటించాలి. ఈ పరమభక్తి అనేది ఒక సూటైన కత్తివంటిది. దీనికి తన, పర అనే భేదములు లేవు. అలాంటి దివ్య ప్రేమతత్త్వాన్ని మనము యీనాడు అర్థం చేసుకోటానికి యేమాత్రంకూడను ప్రయత్నించటం లేదు. భగవంతుడు పరమ ప్రేమస్వరూపుడు. ఆ ప్రేమను అర్థం చేసుకోటానికి కొంత శక్తి కావాలి. దానికి అర్హతకూడా వుండాలి. అప్పుడే యీ ప్రేమను సరైన రీతిలో అర్థం చేసుకోటానికి వీలవుతుంది. కానీ తన భావములు పురస్కరించుకొని భగవంతుని ప్రేమనుకూడను తన భావములతో కూర్చుకున్నప్పుడు అది కేవలం ఒక విపరీతార్థముగా రూపొందుతుంది. దివ్యమైన ప్రేమతత్త్వము వ్యర్థమైనదికాదు. ఈ ప్రేమయే అహంకారపరమైనప్పుడు వికృతమవుతుంది. ఆత్మపరమైనప్పుడు సుకృతమౌతుంది. కనుక ఆత్మభావమే ప్రతిమానవునకు అత్యవసరము.

**ఆత్మదృష్టి లేనప్పుడే అనాత్మభావము ఏర్పడుతుంది**

ఈనాడు మనము చేసే సర్వసాధనలు, ఆత్మాన్వేషణకోసమని భావిస్తున్నాము. అది చాలాపొరపాటు. అన్వేషణ చేయవలసినదికాదు, ఆత్మ. సర్వత్రా వున్నది అదియే. చేసేవాడుతానే, చేయించుకొనేది తానే! సర్వ ప్రపంచము ఆత్మస్వరూపమైవున్నది. ఆత్మ అనే పదార్థము మరొకటిలేదు జగత్తులో. ఆత్మదృష్టిలేనప్పుడే అనాత్మ భావము యేర్పడుతుంది. కనుక, మనదృష్టిని మరల్చుకోటమేకాని మరొకటికాదు, యీ ఆత్మాన్వేషణ. దృష్టి అనగా కేవలము నేత్రములతోచూచే దృష్టికాదు. నేత్రములు దేని

sri sathyasai vachanamrutam

ఆధారముతో చూచుచున్నవో అట్టి ఆధారాన్ని పురస్కరించుకొని విచారించటమే! యిది ఒక అంతర్‌దృష్టి. కనుక, యీకన్నులచేత చూచేవాడు ఎవడో అతనిని చూడటానికి ప్రయత్నించాలి. ఈనాటి ప్రతీసాధనకూడను కేవలం మానసికంగా చేస్తున్నాము. సమస్త సాధనలకు మనసే అధిపతిగా వుంటున్నది. ఈ సాధలకు మనసు అధిపతిగా వుండినంతవరకు వీడు గమ్యాన్ని యేమాత్రం అర్థం చేసుకోలేడు. చేరలేడు. దొంగయేనాటికైననూ తనను తాను పట్టించుకుంటాడా? మనసు అనే దొంగను మనం ఆశ్రయించకూడదు. మరి యేవిధముగా యీ ఆత్మను దర్శించాలి? మనసును మరిస్తే వున్నది, ఆత్మయే! కనుక, మనోనిగ్రహంకాదు మనం చేయవలసినది. ఆత్మదృష్టిని మనం అభివృద్ధిపరచుకున్నప్పుడు మనసు సహజముగా దూరమవుతుంది. మనసు అదృశ్యమైపోతుంది.

### స్వస్థానమును సమీపించటమే ఉపదేశము

ఇట్టి మహాభాగ్యమును పొందే నిమిత్తమై అనేకమంది ఉపదేశములు, ఉపదేశములని ఆశిస్తూవుంటారు. ఉపదేశమనగాయేమిటి? 'ఓంనమఃశివాయ', 'ఓంనమోనారాయణాయ' యిలాంటి మంత్రములుచ్చరించినంతమాత్రమున ఉపదేశమౌతుందా? స్వస్థానమును సమీపించటమే ఉపదేశము! తన స్థానమునకు సమీపంగా చేర్చటమే ఉపదేశము. కేవలము మంత్రములు ఉచ్చరించినంతమాత్రమున ఆయన సమీపానికి మనం చేరలేము. ఇప్పుడు రామ, కృష్ణ, గోవింద, నారాయణ అనే నామములు వుచ్చరిస్తున్నాము. ఇవన్నీ పెట్టిన పేర్లే కాని, పుట్టిన పేర్లుకావు. కనుక మనము పెట్టిన పేర్లను మటుకే ఆధారంచేసుకున్నప్పుడు అవి యేనాటికి స్థిరమైనవికావు. మొట్టమొదట పుట్టినది యేదంటే 'నేను', 'నేను', 'నేను' అనేదే! యీ 'నేను' అనే సంకల్పాన్ని గుర్తించుకోటానికి ప్రయత్నంచేసినప్పుడు సర్వము గుర్తించుకున్నవాడౌతాడు. ప్రణవముకూడను 'నేను' అనే సంకల్పము పుట్టిన తరువాతనే పుట్టినదికాని మొట్టమొదటి శబ్దముకాదు. 'నేను' అనే సంకల్పము పుట్టిన తరువాతనే నీవు, అతను అనే సంకల్పాలు, మిగిలిన సంకల్పాలంతా ఆవిర్భవిస్తున్నాయి. కనుక తననుతాను మొదట 'నేనెవరు?' 'నేనెవరు?' అనే ప్రశ్న వేసుకుని సత్యాన్ని గుర్తించుకోవాలి. 'నేను

sri sathyasai vachanamrutam

బ్రహ్మ', 'నేను బ్రహ్మ', అని నిర్ణయం చేసుకోవచ్చు. అయితే, అక్కడకూడను ఒక 'నేను' వున్నదికదా! ఆ నెనెవరో తెలుసుకొన్నప్పుడు బ్రహ్మ అర్థమవుతుంది.

**సర్వత్రా వున్నది ఒకే దైవము**

ఈనాడు భౌతికమైన, లౌకికమైన సాధనలందే మనము కాలాన్ని వ్యర్థము గావిస్తున్నాము. యిది సరైన సాధన కానేరదు. సర్వత్రావున్నది ఒకే దైవమే! లౌకికము, ఆధ్యాత్మికము అనేవి రెండులేవు. ఆధ్యాత్మికముయొక్క అంగమే లౌకికము. ఒకే దైవమునుండి వచ్చిన జీవులే యీయొక్క కణములు. అగ్నికి యేగుణములుంటున్నవో ఆ అగ్నికణములకుకూడ అదే గుణములుంటున్నవి. కనుకనే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి'. యిందులోనే మనము సరైన అర్థాన్ని తెలుసుకోవచ్చు.

**సర్వదుఃఖములకు, సర్వఅనర్థములకు దేహభ్రాంతియే మూలకారణము**

'తత్త్వమసి' అనే మహావాక్యముంది. అది నీవుగా వున్నావు అని దీని అర్థము. అది యేదో నీవు అర్థంచేసుంటే కదా, అది నేనుగా వున్నానని చెప్పటానికి నీవు అధికారివి అయ్యేది! ఒక విత్తనముంది. ఆ విత్తనము మొక్కగా యేర్పడింది. మొక్క వృక్షంగా మారింది. ఈ వృక్షములో ఆకులు, పువ్వులు, ఫలములు యేర్పడినాయి. అయితే యీ ఆకులు, పుష్పములు, ఫలములు, కొమ్మలు, రెమ్మలు అన్నికూడను 'తత్త్వమసి', ఆ బీజమే మేము అని చెప్పుతున్నాయి. యీ వృక్షము, పుష్పము, ఫలము, కాయలు అన్నీకూడను యేర్పడాలంటే యేది ఆధారము? అదే ఒక బీజము. బీజము బీజముగా వుండినంతవరకు వృక్షముగా మారటానికి వీలుకాదు. బీజము తన రూపాన్ని త్యాగము చేసినప్పుడే అది ఒక మొక్కగా మారి వృక్షంగా తయారవుతున్నది.

కనుక, సర్వదుఃఖములకు, సర్వఅనర్థములకు యీ దేహభ్రాంతియే మూలకారణము. ఈ దేహభ్రాంతి అనేదే బీజము. దానియందే సర్వమూ వుంటున్నది. యీ భ్రాంతిలో మునిగివున్నంతవరకు ఆనందమనే ఫలాన్ని మనము అందుకోలేము. దేహభ్రాంతిని త్యాగము చెయ్యాలి. జీవవృక్షంగా అభివృద్ధికావాలి. జ్ఞానఫలముగా రూపొందాలి. అప్పుడే ఆనందమనే భాగ్యం మనకు లభ్యమౌతుంది. కనుక మనము 'నకర్మణా నప్రజయా ధనేన

sri sathyasai vachanamrutam

త్యాగేనైకే అమృతత్వమానసుః' అనే వేదవాక్యమును గుర్తు పెట్టుకోవాలి. కేవలం ధనమువల్లకాని, సంపదవల్లగాని, యింకేవిధమైన త్యాగంవల్లగాని, కర్మలవల్ల గాని దైవత్వమనే అమృతత్వము మనకు ప్రాప్తించదు. నేను సాధన చేస్తున్నాను, నేను పండితుడుగా వుంటున్నాను, నేను మహావాక్యాలనంతా అర్థముచేసుకున్నాను అనుకున్నంతవరకు వాడు అజ్ఞానియే. ఇవన్నీ తనకు తాను పెట్టుకొన్న పేర్లేగాని మరొకటికావు. తాను తానుగా వున్నాననే అర్థాన్ని గుర్తించినవాడే మహాజ్ఞాని. అహంకారము వుండినంతవరకు ఆత్మసందర్శనము చేయలేడు. అహంకార నిర్మూలనంగావించి ఆచరించే కర్మలు త్యాగముగా మారుతాయి. కనుకనే పరమపవిత్రమైన ప్రేమతత్త్వాన్ని మనము అనుసరించాలి. ఈప్రేమతత్త్వముకంటె సులభమైనది మరొకటిలేదు. అందరినీ ప్రేమించాలి. ఈ ప్రేమలోవుండిన మహాపటుత్వమైనశక్తి అదియే! ప్రేమచేతనే ఐకమత్యం చేకూరుతుంది. ఏకత్వం ప్రాప్తిస్తుంది. ఈనాడు జగత్తులో కన్పించే భిన్నత్వములన్నీకూడను యేకత్వముయొక్క అంశములే! కనుక, అన్ని భిన్నత్వములకు యేకత్వమే మూలాధారము. అట్టి మూలాధారమైన తత్త్వాన్ని మనము గుర్తించినప్పుడు మనము యేమాత్రము విచారించనక్కరలేదు.

**ఐకమత్యములేనిదే ఏ చిన్న కార్యమునుకూడా సాధించలేము**

కనుక, భారతీయులు ముందుగా సాధించవలసినది ఏకత్వము. అదే ఐకమత్యము. ఐకమత్యములేనిదే యే చిన్నకార్యమునుకూడను మనము సాధించలేము. 78 కోట్లు ప్రజలంతా భారతదేశములో వుంటుండి ఒకరికొకరు కించిత్తైనాకూడను సంబంధములేకుండా జీవిస్తున్నారు. ఏ వ్యక్తిని చూచినప్పటికిని స్వార్థము, స్వప్రయోజనము, కులము, మతము. యీ వర్గభేదములు పూర్తిగా ధ్వంసము చేయాలి. ఎవరిదీ యేకులము కాదు. అందరిదీ కలిపి మానవకులము, మానవజాతి. 'నేను బ్రాహ్మణుడను, నేను క్షత్రియుడను, నేను వైశ్యుడను, నేను శూద్రుడను' అనుకోవటము యీ దేహభ్రాంతివల్ల కల్గినవేకదా! 'నేను బాలుడను, నేను యవ్వనుడను, నేను వృద్ధుడను, నేను పురుషుడను' అనుకోవటంకూడా దేహభ్రాంతే! స్త్రీలు, పురుషులు సర్వత్రా

srisathyasaivachanamrutam

వుంటున్నారు. నీవు 'నేను పురుషుడన'ని చెపుతున్నావు. దీనికి ఆధారమేమిటి? దేహభ్రాంతివల్లనే నీవు 'పురుషుడను' అంటున్నావు. దేహాకారంచేతనే వారు 'స్త్రీల'ంటున్నారు. ఇవి దేహరీత్యా అంటగట్టుకొన్నవేగాని సత్యములుగావు. దేహభ్రాంతి వుండినవారికే యీ భేదభావములంతాకూడను. భగవంతుని వరప్రసాదములైన పంచ భూతములకు యే కులముంటున్నది? నీటిదే కులము? నిప్పుదే కులము? గాలిదే కులము? గగనమునదే కులము? ఇవి అందరికి సమానమే కదా! ఇలాంటి యేకత్వాన్ని మనమెందుకు భావించకూడదు? అభివృద్ధిగావించకూడదు? మన జీవితమంతయుకూడను దేహభ్రాంతిలోనే, దేహసంబంధమైన ఆశలతోనే మనము గడిపివేస్తున్నాము. వ్యక్తిగతమైన భావములెన్నైనా పెట్టుకోవచ్చు. కాని సమిష్టిస్వరూపమైన దేశతత్త్వములోపల మనమందరము అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రనే సత్యభావాన్ని గుర్తించాలి.

### ఏకత్వభావము ఏర్పడాలంటే సేవలో పాల్గొనాలి

ఇలాంటి ఏక భావము మనలో యేర్పడవలెనంటే మనము సేవలలో పాల్గొనాలి. దేహమువచ్చింది. కాని, యిది యెందుకోసం వచ్చింది? దీనిని చక్కగా విచారించాలి. నిజంగా మనం యోచనచేస్తే దేహము ఒక విస్తరాకువంటిది. ఆ విస్తరాకుపైన రుచికరమైన పదార్థములు పెట్టుకొని భుజించి, ఆనందించి తదుపరి నిర్లక్ష్యంగా ఆయొక్క విస్తరాకును మనము పారవేస్తాము. అదేవిధముగనే యీ దేహమనే విస్తరియందు సద్గుణములు, సదాచారములు, సత్ప్రవర్తనలు అనే ఫలాహారాలంతా పెట్టుకొని మనము అనుభవించి ఆనందించి, పదిమందికి అందించి. తదుపరి యీ దేహమనే విస్తరిని నిర్దాక్షిణ్యంగా విసర్జించాలి. అయితే విస్తరికలదుకదా అని వ్యర్థ పదార్థములంతా అందులోవుంచుకొని ఆరగించటానికి ప్రయత్నిస్తామా? మంచి మంచి పదార్థములే మనము భుజించటానికి ప్రయత్నిస్తాము. రుచికరములైన పదార్థములే మనము ఆశిస్తాము. ఆర్యోగమును అందించే పదార్థములే మనము ఆశిస్తాము. ఆరోగ్యమును అందించే పదార్థములే మనము ఆరగిస్తాము. కనుక, యీ దేహము అనే విస్తరియందు పవిత్రమైన గుణములను మనము



sri sathyasaivachanamrutam

వడ్డించుకోవాలి. పవిత్రమైన భావాలు అరగించాలి. దివ్యమైన తత్త్వాలు యిందులో మనము అనుభవించాలి. దేహమున్నదికదాయని యిష్టమువచ్చిన పనులు మనము చేయరాదు. తలవున్నదికదా అని అనవసరమైన విషయాలలో మనము ప్రవేశించరాదు. కనులున్నవికదా అని అనేకవిధములుగా మన దృష్టిని పాడుచేసుకోరాదు. చూడవలసిన దృశ్యములనుమాత్రమే మనము చూడాలి. చూడరాని విషయములు మనము యేమాత్రముకూడను చూడరాదు. చేతులతో మంచి పనులు మాత్రమే చేయాలి. ఇలాంటి పవిత్రమైన కర్మలచేతనే యీ జీవితాన్ని సార్థకము, పవిత్రము గావించుకోవాలి.

**భగవంతుడు ఏమైనా చేయవచ్చును**

ప్రేమస్వరూపులారా! ఈ ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశించటానికి మీరు అమితంగా ఆలోచనలు, విచారణలు చేయవలసిన అవసరం లేదు. భారతీయులయొక్క సంస్కృతి మూఢనమ్మకములతో కూడుకున్నదికాదు. అనేక విధములైన సాధనలు సల్పి, పరిశోధనలుచేసి, అనేకమంది మహర్షులు అనుభవించి, ఆనందించి పదిమందికి పంచిపెట్టిన మహత్తరమైన సంస్కృతి యిది. వేద, శాస్త్ర, యితిహాస, పురాణములనుండి పవిత్రమైన క్షీరమును తిరిగి తీసి దానినుండి ఒకవిధమైన వెన్నవంటి సారమును అందుకొన్నది, భారతదేశము. భారతదేశము మట్టిముద్దగాని, మాంసపుముద్దగాని కాదు. ఇది అమృతపుముద్ద. ఆనందపుముద్ద. సర్వశాస్త్ర యితిహాసముల సారమైన వెన్నముద్ద. ఇలాంటి పవిత్రతను మనము విచారించటానికి ప్రయత్నించక, ఏదో ఎవరికి తోచిన రీతిగా వారు యోచించటము, అనుసరించటము యిది భారతీయులకు సరైన కర్తవ్యము కాదు. భగవంతుడు సర్వత్రా, సర్వులయందు వుండటంచేత అతను యేపనైననూ చేయవచ్చును. భగవంతుడైతే యిది చేస్తాడా అట్లావుంటాడా యిట్లావుంటాడా అని విచారించి నిర్ణయించే శక్తి, అధికారము ఎవరికీ లేదు. భగవంతుడు యేమైనా చేయవచ్చు.

**కన్నీరు తెప్పించు కన్నీరు తప్పించు**
**జోగి భోగిగ జేయు భోగి జోగిగజేయు**
**పిచ్చిని పట్టించు పిచ్చిని పోగొట్టు**

srisathyasaivachanamrutam

పుట్టించు రక్షించు హతమొనర్చు.

యేవిధమైన సంకల్పముచేత, ఏ కార్యమునందు యేవ్యక్తిని, ఎప్పుడు, యెక్కడ, యెట్లా ఏవిధముగా ఉపయోగించుకోవాలన్నది దైవానికి తెలుసు. దైవము యివే చెయ్యాలి అవే చెయ్యాలి అని నిర్ణయించే అధికారము యెవ్వరికి లేదు. హిరణ్యకశిపుడున్నాడు, ప్రహ్లాదుడున్నాడు. ప్రహ్లాదుని రక్షించాడు, హిరణ్యకశిపుని శిక్షించాడు. ఆ కాలమునకు, ఆ శాపమునకు, ఆ పరిస్థితులకు అనుగుణముగా భగవంతుడే అన్ని విధములా నటన చేస్తాడు.

**భగవత్తత్త్వము ఇట్టిది, అట్టిది అని నిర్ణయించే అధికారము యెవ్వరికి లేదు**

విశ్వం విష్ణు స్వరూపము. సర్వత్రావుండిన భగవంతునికి స్వార్థమన్నదే లేదు. స్వార్థములేని భగవంతుడు యే పని చేసినాగాని అది పరార్థమే, అది పవిత్రమే, అది ధర్మమే! కనుక, యిట్టి సత్యస్వరూపమైన దైవత్వాన్ని యిట్టిది అట్టిది అని నిర్ణయించే అధికారము యెవ్వరికి లేదు. వేదోపనిషత్తులు సైతం అనేక విధములుగా పరిశోధనలుచేసి కడపటికి 'నేతి, నేతి' యిది కాదు, యిది కాదు అనే మార్గమువరకు పోయారేగాని ఇది ఫలానా అని చెప్పటానికి యెవరికి అధికారములేకుండా పోయింది.

జగత్తంతకు పాత్రధారి, సూత్రధారి తానే! అన్నిరూపములలోకూడను అతనొక పాత్రధారిగా నటన చేస్తున్నాడు. అనేది తానే, తిట్టించుకొనేది తానే! ఏడ్చేది తానే, ఏడ్పించేది తానే! ఇలాంటి భగవంతుని యేమని మనము నిర్ణయించటానికి వీలవుతుంది? అయితే దైవత్వానికి ఒక్కటిమాత్రమే లక్షణము. అదే ప్రేమతత్త్వము. ఆకర్షించే ప్రేమతత్త్వముంటుంది, ఆయనకు. ఈ ఆకర్షణ అందరికి వుండటానికి వీలుకాదు. సముద్రమునకే విశాలమైన, అనంతమైన, అగాధమైన లోతు వుంటుంది. దానినుండి తెచ్చుకున్న టంబ్లరు వాటర్‌కు దానియొక్క విశాలత వుంటుందా? సముద్రముయొక్క రుచి వుండవచ్చుగాని, యీనీరు సముద్రము కానేరదు. అదే రీతిగా జీవులుగా వుండినవారికి వారి వారి శక్త్యానుసారము, వారి వారి సంస్కారమునుసరించి ఆ లక్షణములు కొంతవరకు వుండవచ్చునే తప్ప, అంతకంటె అధికంగా వుండటానికి వీలులేదు.

sri sathyasai vahanamrutam

## ప్రేమకు పైసా ఖర్చులేదు

ఇన్ని వేలమంది, యిన్ని లక్షల జనులంతా ఇక్కడకు ఆకర్షింపబడటానికి యిక్కడ యేదో ఒకటివుండాలికాని అది లేకపోతే యిన్ని వేలమంది రావటానికి వీలులేదు కదా! వీరందరికి మేము Invitation ఏమైనా అందించామా? రమ్మని జాబులేమైనా వ్రాశామా లేక పేపర్లో ప్రకటన వేశామా. లేదు. లేదు. స్వామి దివ్య ప్రేమయొక్క ఆకర్షణే దీనికి మూలకారణము. కనుకనే త్యాగరాజుకూడా ఒకప్పుడు చెప్పాడు.

**లేకనా నిన్ను చుట్టుకున్నారు**
**శ్రీకర కరుణాసాగరుడని నిన్ను**
**చిన్మయరూపా చింతామణి నీవెగా...**

'కరుణాసాగరమనే చింతామణి నీ దగ్గర లేకపోతే యింతమంది నీవైపు ఆకర్షింపబడే యిది వుంటుందా? కనుక, ఆ చింతామణి నీ దగ్గరలేకపోతే యిందరు చేరటానికి వీలవుతుందా రామా!' అన్నాడు. అట్టి ప్రేమ చింతామణి యిక్కడ వుండటంచేత యింతమంది యిక్కడ చేరటానికి వీలైంది. ఎవరికి తోచినట్లు వారు చెప్పవచ్చును. యెవ్వరైనా సరే, యింతమందిని ఆకర్షించేశక్తి ఎక్కడైనా వున్నదేమో చూపించమనండి. లారీలకు లారీలలో తీసుకువచ్చి దింపినా వుండటానికి ఇష్టపడరు. పరుగెత్తి పోతుంటారు. కాని, ఇక్కడ వద్దు వద్దు షెడ్లులో స్థలంలేదని చెప్పినాకూడా చెట్లక్రిందైనా వుంటామంటారుకాని వెనక్కిపోవటానికి యేమాత్రం అంగీకరించరు. ఇదే నిజమైన హృదయానికి, హృదయానికి సంబంధించిన ప్రేమ. నిర్బంధముగా యెవ్వరు యిక్కడకు రావటానికి వీలుండదు. ఆ ప్రేమపాశమే వీరందరిని యిక్కడ కట్టివేస్తుంది. అదియే మనకు దైవశక్తి. అందరూకూడను యీ శక్తులు, ఆ శక్తులు ప్రదర్శిస్తున్నారని భావించవచ్చును. మీ దృష్టిలో యివి ప్రదర్శనలుగాని నాది నాకు నిదర్శనము. ఇది నాకు సహజము. మీ దృష్టికది ప్రదర్శనము. నా సహజాన్ని నేను అనుసరిస్తూపోతున్నాను. అదియే దివ్యమైన ప్రేమ సహజము. ఇది అందరికి సాధ్యమయ్యేదికాదు. ఎన్ని శాస్త్రములైనా, ఎన్నివేదములైనా. ఎన్ని వుపనిషత్తులనైనా, బ్రహ్మసూత్రములనైనా మీరు సాధించి, శోధించి అందుకోండి చూద్దాం. ఏనాటికి యిది

sri sathyasai vachanamrutam

సాధ్యంకాదు. ఆ ప్రేమను ఆధారం చేసుకున్నవారికిమాత్రమే యిది అర్థం అవుతుంది. ప్రేమకు నయాపైసా ఖర్చులేదు. మీయందు సహజముగానే ఆ ప్రేమ వుంటున్నది. ఆ సహజప్రేమను మీరు అనుభవించటానికి ప్రయత్నంచేస్తే అది మీకు లభ్యమవుతుంది. రామదాసు చెప్పాడు.

**రామనామమను మిఠాయి యిదిగో రండి భక్తులారా!**
**వేదసారమను గోధుమపిండిలో వేదవాక్యమను క్షీరముపోసి**
**ఆనందమైన పెద్దబాండువతీసి ఆదిమునులు దీనిని బాగుగకలిపిరి॥రా॥**
**రుచికరమైనది రామ మిఠాయి సకల రోగనివారణమోయీ**
**ఒక్కకాసైనను ఖర్చులేదోయి ఆనందముగ మీరు అందుకోండోయి ॥రా॥**

దీనికి యేమాత్రము ఖర్చులేదు. అయితే మీకు వచ్చేపోయే ఛార్జీలు మాత్రము ఖర్చు. ఆ ఖర్చుకూడను ఒక పవిత్రమైన ఖర్చే. కనుక యీ పుట్టపర్తియాత్ర అనే ఖర్చుకూడను ఖర్చుకాదు. అది ఒక ప్రాప్తియే! అయితే ఆ ఖర్చులేక యీ ప్రాప్తి మీకు లభ్యముకాదు. మనం షాపుకువెళ్లి ఒక కర్ఛీఫ్ కొనుక్కోవాలంటే ఐదురూపాయలిస్తే కర్ఛీఫ్ యిస్తాడు. మనం యివ్వందే పుచ్చుకోటానికి అధికారంలేదే! అదే రీతిగా మీరు యేకించిత్తైనా త్యాగంచేసి యిక్కడికి వచ్చినప్పుడే యీవిధమైన భావమనేది మీకు లభ్యమౌతుంది. ప్రేమ అనేది యిచ్చిపుచ్చుకొనేది. భగవంతుడు యేమి చేసినా, యేమి చెప్పినా, యేమి తలచినా అంతా ప్రజల నిమిత్తమేకాని తన నిమిత్తము కాదనేటువంటి సత్యాన్ని దృఢముగా మీరీనాడు విశ్వసించాలి.

## ఎట్టి సంకల్పమో అట్టి ఫలము

స్వామికి యేకోశానకూడను స్వార్థమనేటువంటిది లేదు. మీరు నమ్మినా నమ్మకపోయినా, నాకందరూ ఒక్కటే! అయితే వారి వారి ప్రాప్తానుసారము కొంచెము వుంటుంది. సముద్రములో కావల్సినంత నీరు వుంటున్నాది. ఎవరు యెంత పాత్ర తీసుకుపోతారో అంత పాత్రకే నీరు లభ్యమౌతుంది. అదే విధముగా వారి కర్మానుసారముగా, వారి ప్రాప్తానుసారముగా యీయొక్క అదృష్టమనేది లభ్యమౌతుంది.

sri sathyasai vachanamrutam

కనుక యీనాడు మనము సత్సంకల్పాలను అభివృద్ధిపరచుకోవాలి. సంకల్పమువల్లనే కర్మవల్లనే, సాధన. సాధనవల్లనే శీలము. శీలమువల్లనే ప్రాప్తి. అదృష్టదురదృష్టములంతా సంకల్పములపైన ఆధారపడివుంటుంది. ఎట్టి సంకల్పమో అట్టి ఫలము. మన కర్మలను మనము అనుసరించే తీరాలి. అయితే, అనుసరిస్తూకూడను భగవంతుని ఆనందముగా ఆరాధిస్తూవుంటే యింతకంటె ప్రాప్తి మరొకటిలేదు. మనలో దుర్భావములు, దుర్గుణములు, దురాలోచనలు పెట్టుకొని సద్భావములుగా మనము నటనచేస్తే భగవంతుని వంచించినట్లవుతుంది. ధనముతో దాగుడుమూతలాడటానికి యిక్కడ యేమాత్రము అవకాశంలేదు. గుణధనము మనము పెంచుకోవాలి. విశ్వాసబలమును మనము పెంచుకోవాలి. శరణాగతి అనే తత్త్వములో మనము జీవితాన్ని సాధించాలి.

**దైవానుగ్రహమువల్ల కొండలు పిండిగా మారిపోతాయి**

అనేకమంది అంటుంటారు, 'నన్నెందుకింత బాధపెడుతున్నావు? నన్నెందుకింత అవస్థలపాలు చేస్తున్నావు', అని. నిజముగా శరణాగతుడైనవాడు యీ ప్రశ్నలకేమాత్రం అవకాశము యివ్వడు. శరణాగతుడైనవానికి అన్నీ భగవంతునియొక్క ప్రసాదములే! కనుక యీ శరణాగతి తత్త్వమును మనము అభివృద్ధిగావించుకొని. దానిని పవిత్రముగావించుకొని, సార్థకముగావించుకొనే నిమిత్తమై హృదయమును విశాలము చేసుకోవాలి.

**కర్మ దాట వశమా నరుడా కర్మ దాట వశమా**
**చిన్న చెలమలో ముంచిననైనా సప్తసాగరాల్ నించిననైనా**
**కడవెంతో నీరంతేరా కావాలన్నా ఎక్కువ రాదుర ॥కర్మ॥**
**ధనికుడు త్రుటిలో బికారికాదా పండితుడింతలో పశువైపోడా**
**కట్టపాపై కరవను రాదా కర్మ హేతువు కర్మే మూలము ॥కర్మ॥**
**భుజబలమెంతో చూపినగాని మొనగాడనుచు మురిసిననైన**
**ముక్కును త్రాడై ముందుకులాగే ఆముగదాడే కర్మరా**
**ఘన పాఠంబులు చదివినగాని కులదేవతలను కొలచినగాని**

srisathyasai vachanamrutam

**కారడవులకే పోయినగాని కఠిన తపస్సులే చేసినగాని ॥కర్మ॥**

యీకర్మను దాట ఎవరి వశము? ఎట్లా? దైవానుగ్రహాన్ని సాధిస్తే కొండలంతా పిండిగా మారిపోతాయి. అలాంటి అనుగ్రహము ఒక్క దైవములో మాత్రమే యిమిడివుంది. అణుమాత్రమైన అగ్ని పర్వతమువంటి ప్రత్తినికూడను ఒక్క క్షణములో దగ్ధంచేస్తుంది. అయితే యీ అగ్ని యేరీతిగా మనకు లభ్యమవుతుంది? అది ప్రేమవల్లమాత్రమే లభ్యమౌతుంది. ఆ ప్రేమను మనం పెంచుకోవాలి. ప్రేమతోనే సేవలు చేయాలి. ఏ సేవలు చేస్తున్నప్పటికి నామస్మరణతో చెయ్యాలి. నామము లేకపోతే యీ మనసు యెక్కడెక్కడకో పరుగెత్తిపోతుంది. ఇది చంచలత్వమునకు పుట్టినిల్లు. పెట్టినది పేరు. కనుక, మనము యితర చింతనలకు చోటివ్వకుండా భగవన్నామము ఉచ్చరించుకుంటూ కర్మలలో ప్రవేశించాలి.

**సమాజసేవ సర్వేశ్వరుని సేవగా విశ్వసించాలి**

దివ్యాత్మస్వరూపులారా! యీనాటి జన్మదినోత్సవమందు తెల్సుకోవలసినది, ఆచరించటానికి ప్రయత్నించవలసినది, యీనాటినుండి మీరు ప్రారంభించ వలసినది, మూడు మాత్రమే! పరులను విమర్శించటం మానుకోండి. పరదూషణ అనేది మహాపాపము. పరులను దూషించటమే మహాపాపమనగా పరమాత్మను దూషించుట మరీపాపము. కనుక దేనియొక్క చెడ్డనుగాని, పరులయొక్క దోషములుగాని మనము యేమాత్రము విచారించరాదు. అందరిని ప్రేమతో మనము స్వాగతము చేయాలి. కర్మలలో ప్రవేశించాలి. పల్లెలయందు చేరి పవిత్రమైన సేవలు మనం చేయాలి. నేను చెప్పాను ఇంతకు పూర్వమే,

**గ్రామసేవయన్న రామసేవయే సుమీ**
**రామరాజ్యమన్న ప్రేమమయమే**
**ఇచ్చుకొనుము సేవ పుచ్చుకొనుము ప్రేమ**

ఈ సేవలందు మనము కంకణం కట్టుకొని ప్రవేశించాలి. సమాజసేవ సర్వేశ్వరుని సేవగా విశ్వసించాలి. మరొక్కటికూడా మీరీనాడు చక్కగా దృష్టియందుంచు కోవాలి. మనసంస్థల పేరుతోవుండిన ఎట్టి కార్యములందు ప్రభుత్వముతో మనకు యేమాత్రం సంబంధము



sri sathyasai vahini amrutam

వుండకూడదు. ప్రభుత్వం చేయవలసిన పనులు ప్రభుత్వం చేస్తుంది. ఇవి మనప్రాప్తికోసం చేయవలసిన పనులు. కనుక, స్వయంకృషితో మనము సాధించాలి. యితరుల సహాయం మనకక్కరలేదు. మనకు యెంతశక్తో అంతవరకు చాలు. గొప్పగా మనం చేయనక్కరలేదు.

**గంగి గోవుపాలు గరిటెడైనను చాలు**
**కడివెడైన నేల ఖరముపాలు?**

కనుక, మన సంస్థలు ప్రభుత్వముతో సంబంధంలేకుండా వుండటం ఒకటి, సమాజములో ప్రవేశించి సేవలు చేయటం రెండవది, మూడవది పరదూషణలేకుండా వుండటం. ఇవే నిజమైన సాధనలు.

**ప్రేమతో సేవలో పాల్గొని జన్మ సార్థకము చేసుకోండి!**

పిల్లలయందుగాని పెద్దలయందుగాని ఎవరియందైనాసరే, యితరులు యెవరైనాగాని ప్రక్కనుండి దూషిస్తుంటే రెండు వెయ్యి, వాడికి సరైన బుద్ధివస్తుంది. 'పిచ్చివాడా! నేను వేసిన దెబ్బ నీకోసంకాదు. నీ గుణమునకు దెబ్బకొట్టాను', అని చెప్పు. అందరూ వింటూవుంటే యీ చెప్పేటువంటివారు యింకా చెప్తూపోతుంటారు. వారి దూషణలు మనం వింటూవుంటే ఇంకా అభివృద్ధి గావించుకుంటూపోతుంటారు. 'శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రః' అని అమృత పుత్రుడుగా నీవు పుట్టావు. నీవు పశువుకాదు. నీవు రాక్షసికాదు. దానవుడుకాదు. నీవు మానవుడవు. మానవుడై పుట్టి సాటి మానవుని తిరస్కరించటము, దూషించటము మహాపాతకము. 'ఇది మానవత్వానికి సరైన గుణముకాదు', అని వారికి బుద్ధి చెప్పాలి. నీవు యితరులను యెంత దూషించినావో అంతకు పదింతలు దూషించబడతావు. ఇతరుల చెడ్డను నీవు యెంత కోరుతూపోతావో అంతకు నాల్గింతలు చెడ్డ నీకే జరుగుతూవస్తుంది. అదికూడను జాగ్రత్త. కనుక, యెవ్వరిని మనము విమర్శించరాదు. ప్రేమను పెంచుకుంటే యీ దూషణ, భూషణ, తిరస్కారములంతా దూరమైపోతాయి. కనుక భగవంతుని స్మరించుకుంటూ భజించుకుంటూ ప్రేమతో సేవలో పాల్గొని జన్మను సార్థకము చేసుకొని నేనే దైవమనే దివ్యతత్త్వము చింతిస్తూ రండి. కనుక యెవరికివారు దేవుడుగానే వుంటుండాలి. దేవుడు ప్రత్యేకముగా ఒకచోట వున్నాడని కాదు.



sri sathyasaivachanamrutam

నీవు నీ దేవుడుగానే వుంటున్నావు. నీవు వేసుకున్న డ్రస్సునుచూచి మానవుడని భ్రమిస్తున్నావు. ఈ భ్రమలోవుండినంతవరకు బ్రహ్మను నీవు చూడలేవు. బ్రహ్మను చూడలేకపోవటానికి మన భ్రమలే మూలకారణము. భ్రమను దూరముచేసిన బ్రహ్మ సమీపుడవుతాడు. కనుక భజనలతో భగవంతునియొక్క నామస్మరణచేస్తూ కాలమును సార్థకము గావించుకోండి. క్షణమైనకూడను మనము అనవసరమైన విషయాలలో ప్రవేశించరాదు. నిరంతరము రామచింతనచేసిన కోతి హనుమంతునిగా మారిపోయాడు. చంచలత్వము కల్గిన కోతి యెంత శాంతస్వరూపుడైనాడు! అందుకోసమే సీత హనుమంతుని వర్ణించింది, 'శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు, హనుమంతుడు' అని. కనుక అలాంటి శాంతస్వభావము, ఆ గుణములు, ఆ బలములు, ఆ దివ్యమైన నామము మనము యీనాడు అనుభవించటానికి ప్రయత్నించాలి.

**(తేదీ 23-11-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahanamrutam